

# మరపురాని సంఘటన

ఈ కథ, ఆంధ్ర ప్రభ సచిత్ర వారపత్రిక - 1955 జూన్, 22 సంచికలో ప్రచురితమయ్యింది.

డాక్టర్ చంద్రశేఖరం అందరికీ మందులిచ్చి జబ్బు నయం చేశాడు గానీ, తన ఏకైక పుత్రుడు రామును ఏ విధానా బతికించుకోలేకపోయాడు. ఇతర రోగులవలె గాక కుమారుని విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని రాత్రింబవళ్లు సేవచేశాడు. జబ్బును కనుక్కోవడంలో పెద్ద కష్టమేమీ లేకపోయింది. అటువంటి జబ్బు వచ్చిన నలుగురిని ఇంతకుపూర్వం బతికించగలిగాడు.

రాముకోసం మరలా ఆ జబ్బును గురించి మెడికల్ గ్రంథాలు చదివి తనకున్న పదేళ్ల అనుభవంతో అతి జాగ్రత్తగా ట్రీట్ చేశాడు. కానీ, డాక్టర్ శ్రమ వృథా అయింది. వారం రోజులు మంచానపడి రాము తల్లిదండ్రులను దుఃఖసాగరంలో ముంచి ఈ లోకం వదలిపోయాడు.

అప్పుడు రాత్రి పదిగంటలై ఉంటుంది. అది గాఢాంధకారమైన రాత్రి. డాక్టర్ చంద్రశేఖరం ఇంట్లో మినుకుమినుకుమంటూ ఒక్క దీపం మాత్రం వెలిగించబడి ఉంది. డాక్టరు భార్య ఏడ్చి ఏడ్చి ఇక ఏడ్చే శక్తి లేక రాము శవంమీద పడిపోయి మూలుగుతున్నది. చంద్రశేఖరం భార్యను ఓదార్చే స్థితిలో లేడు. ఇంట్లో ఉన్న ఒక్క నౌకరును రాము మరణవార్త, బంధువులకు తెలియజేయడానిగ్గాను ఇంకో ఊరికి పంపాడు. భార్యాభర్తలు తప్ప ఆ ఇంట్లో ఎవరూ లేరు.

చంద్రశేఖరానికేమీ పాలుపోవడంలేదు. చాలాకాలానికి వాళ్లకు రాము జన్మించాడు. అతణ్ణి అల్లారుముద్దుగా పెంచారు. ఈవేళ రామును మరచిపోవడం అంటే మాటలా? తన అశక్తతవల్లనే చనిపోయాడని డాక్టరు అనుమానం. ఇంకో డాక్టరుకు చూపించి ఉంటే? బతుకునేమో. ఆ జబ్బు పెద్ద ప్రమాదమైందేమీ కాదు. పైగా అతి జాగ్రత్తగా ట్రీట్ చేశాడు.

"డాక్టర్! డాక్టర్!" అంటూ బైట ఎవరో తలుపు తడుతున్నారు. డాక్టర్ వినిపించుకునే స్థితిలో లేడు. ఏదో ఆలోచిస్తున్నాడు. ఆరో పిలుపునకు డాక్టరు ఈ లోకంలోకి వచ్చి, ఆ పిలుపు విన్నాడు. ఇల్లంతా గాఢాంధకారంగా ఉంది. డాక్టరు హాలు దాటి వచ్చి తలుపు తీశాడు. ఎవరో సన్నటి వ్యక్తి బయట నిలబడి ఉన్నాడు.

"డాక్టరు గారు ఉన్నారా?" అంటూ ఆ నూతన వ్యక్తి ఆదుర్దాగా ప్రశ్నించాడు.

"నేనే డాక్టర్ని."

ఆ నూతన వ్యక్తి గాఢంగా గాలి పీల్చుకుని వదలి, "మీరు ఉండరేమోనని చాలా భయపడ్డాను, డాక్టర్! నా భార్య చాలా ప్రమాదస్థితిలో ఉంది. మీరు త్వరగా రండి!"

"క్షమించండి, నా కుమారుడు చనిపోయి నాలుగు గుంటలైనా కాలేదు!" అంటూ డాక్టర్ ఆ వ్యక్తి జవాబుకోసం నిరీక్షించకుండా లోపలికి వెళ్లాడు.

'నీ దురదృష్టం కాకపోతే ఈవేళే డాక్టరు కుమారుడు చనిపోవాలా? ఏం చేసేది?' అని తనలో అనుకుని, ఆ నూతనాగంతకుడు లోపలికి వచ్చాడు. అతనికి ఏదీ కనపడటంలేదు. ఆ చీకట్లో తడువుకుంటూ, చేతికి తగిలిన ఒక కుర్చీమీద కూర్చున్నాడు.

లోపలికి పోయిన డాక్టరుకు ఏమీ తోచడంలేదు. కళ్లు మూసుకున్నా రాము నవ్వుముఖం కనబడుతున్నది. లైబ్రరీ గదిలోకి పోయి కూర్చున్నాడు. ఏమీ తోచక అక్కడే కళ్లు మూసుకుని అర్ధగంట గడిపాడు. టేబిల్ మీదున్న పుస్తకం తీసుకుని చదవడానికి ప్రయత్నించాడు.

అంతా చీకటిగా ఉంది. చదవడం సాధ్యమయ్యే పనేనా? ఆ చీకట్లో తాను చదవాలనుకోవడం ఎంత తెలివితక్కువో డాక్టరు గ్రహించి, తన తెలివితక్కువతనానికి నవ్వుకున్నాడు. ఆ పుస్తకాన్ని అక్కడే పడేసి, మరలా రాము శవం వద్దకు వచ్చి భార్యను చూచాడు. ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తూ, "ఏం.... చేస్తాం ... అంతా దైవఘటన!" అని భార్యతో అన్న మాటలు అతనికే సరిగా వినపడ్లేదు. ఇక భార్యకు వినపడటం అనేది అసంభవం.

డాక్టరు మరలా హాల్లోకి వచ్చాడు. "డాక్టరుగారూ!" అంటూ ఆ నూతన వ్యక్తి డాక్టరు వద్దకు వచ్చాడు. ఆ వ్యక్తి సంగతే డాక్టరు మరచిపోయాడు. ఎవరైందీ తెలియక ఒక్క క్షణం ఆశ్చర్యపడ్డాడు. తరువాత ఎవరైందీ జ్ఞాపకానికి వచ్చింది.

"ఇందాక మీకు నేను రాలేనని చెప్పలేదూ?" అన్నాడు డాక్టర్.

"మీరు చెప్పింది నిజమే, డాక్టర్! మిమ్ము ఇటువంటి సమయంలో పిలవడానికి నాకే నోరు రావడంలేదు. అయినా విధిలేదు. అచ్చట ఒక ప్రాణికి అకస్మాత్తుగా జబ్బు చేసింది!"

"ఇటువంటి స్థితిలో నేనెవర్నీ పరీక్షించి మందులివ్వలేను. క్షమించండి. నన్ను తీసుకుపోవడం వలన ఏమీ ప్రయోజనం ఉండదు!" అని డాక్టర్ వెనక్కు తిరిగాడు.

ఆ నూతన వ్యక్తి డాక్టరు చేతులు పట్టుకుని "డాక్టరు గారూ! మిమ్ము నేను చట్టప్రకారం తీసుకుపోగలను. కానీ ఆ పని మాత్రం నాకు ఇష్టం లేదు. చూడండి ... ఈ చుట్టుపక్కల ఎక్కడా ఒక్క డాక్టరూ లేడు. అటువంటి పరిస్థితుల్లో నేనేం చేసేది?"

డాక్టరు మెల్లగా ఆ నూతన వ్యక్తి చేతిపట్టునుంచి విడిపించుకుని "చట్టప్రకారం నేను ఎల్లప్పుడూ, ఎవరు పిలిచినా రావాలని నాకూ తెలుసు. నా పరిస్థితి కళ్లారా చూశారు గదూ, నా మనస్సు నా స్వాధీనంలో లేదు. ఇక రోగిని పరీక్షించేదెట్లా?"

"డాక్టరుగారూ! మీ కుమారుడు చనిపోయాడు. దానికి నా హృదయపూర్వకమైన సానుభూతి. మరలా అతణ్ణి బతికించగలరా? నేను అమితంగా ప్రేమించిన నా భార్య చావు బతుకుల్లో ఉంది. అటువంటప్పుడు మానవుడుగా మీ కనీస ధర్మం మీరు నిర్వర్తించరా. మీ కుమారుడు చనిపోయాడని ఇంకో ప్రాణి చనిపోవడం కళ్లారా చూస్తూ ఊరుకుంటారా? మీరే చెప్పండి!"

ఆ నూతన వ్యక్తి మాటలు డాక్టరు మీద పని చేశాయి. "నా భార్య ఒక్కతే ఇంట్లో ఉంది. నేను మీతో వస్తే శవంతో ఒక్కత్తే ఉండగలదా?" అని డాక్టరు చిన్న సాకుతో తప్పించుకోబోయాడు.

"నాతోపాటు నా నౌకరు కుర్రాడు వచ్చాడు. వాణ్ణి ఇక్కడ కాపలా పెట్టి పోదాం. మరలా మిమ్మల్ని ఒకటిన్నర గంటలోపు మీ ఇంటివద్ద దిగబెడతాను. నా గుర్రాల వేగం ఈ చుట్టుపక్కల మరే గుర్రాలకూ ఉండదు!" అని ఆ నూతన వ్యక్తి అన్నాడు.

డాక్టరు కాసేపు ఆలోచించి "లోపలికెళ్లి మెడిసిన్ చెస్ట్ తీసుకువస్తానుండండి!" అంటూ లోపలికెళ్లాడు. ఆ నూతన వ్యక్తి చాలా ఆదుర్దా పడుతున్నాడు. క్షణమొక యుగంగా గడుపుతున్నాడు. అతను హృదయపూర్వకంగా ప్రేమించిన భార్య చావు బ్రతుకుల్లో ఉంది. ఇంక అతని మనసెట్లా స్థిమితంగా ఉంటుంది? డాక్టరు మరలా తిరిగి రావడానికి మూడు నిమిషాలు పట్టింది. ఆ మూడు నిమిషాల కాలంలో ఆ నూతన వ్యక్తి "డాక్టరు వస్తున్నాడా, లేదా?" అని పదిసార్లు తొంగిచూశాడు.

ఇద్దరూ గుర్రంబండి ఎక్కారు. గుర్రం పోకడ చూసి, డాక్టరు ఆ నూతన వ్యక్తి తన గుర్రాల గురించి చెప్పిన మాటలు అతిశయోక్తి కాదనుకున్నాడు. దారిమాత్రం చాలా ఘోరంగా ఉంది. ఆ దారంతా గతుకులే. ఆ గతుకుల్లో బండి చక్రాలు పడినప్పుడు వచ్చే కుదుపులకు ఒళ్లు కదలిపోతున్నది. ఇరవై నిమిషాలవరకూ ఎవ్వరూ మాట్లాడలేదు.

**మూలం : ఆంటన్ చెకోవ్**

**అనుకరణ : శ్రీ దువ్వూరి చిరంజీవి**

"మీద పడుకోబెట్టి నీళ్లు చల్లాము. ఎంతసేపటికీ స్పృహ రాలేదు. రాయుణ్ణి పోయి మిమ్మల్ని తీసుకరమ్మన్నాను. మీతో పరిచయం లేదని అతడు చెప్పాడు. అసలు నేను రావడమే నా అదృష్టం. మిమ్మల్ని ఒప్పించి తీసుకు పోగలుగుతున్నాను. అయినా అర్ధరాత్రిపూట ఈ గతుకుల దారిలో మిమ్మల్ని శ్రమపెడుతున్నందుకు క్షమించండి, డాక్టరుగారూ!" అని ఆ నూతన వ్యక్తి ముగించాడు.

"ఫరవాలేదులెండి!" అంటూ డాక్టర్ ఆలోచనలో పడ్డాడు. కుమారుని సంగతి మరచిపోయి డాక్టరు, ఆమె జబ్బు ఏమై ఉంటుందా అని ఆలోచిస్తున్నాడు.

తరువాత ఎవ్వరూ మాట్లాడలేదు. ఆ నూతన వ్యక్తికి తన భార్యను గురించి ఆందోళన ఎక్కువైంది. ఆమె ఇంకా బతికి ఉంటుందా? సమయానికి వైద్యసహాయం లేక చనిపోయిందా? ఆమె మరణించి ఉంటుందనే ఊహ మనస్సుకు తట్టగానే అతను భయంతో వణికిపోయాడు. ఆమెను ఎట్లా మరిచిపోవడం? బంధువులందరినీ ఎదిరించి, ఏరికోరి బీద కుటుంబంలో జన్మించినా, ఆమె సౌందర్యానికి ముగ్ధుడై వివాహం చేసుకున్నాడు. ఆమె తన భార్య అయినందువలనే బంధువులు దూరమయ్యారు. ఇక వారి వాతావరణంలో బతకలేక, వారికి దూరంగా వచ్చి ఈ పరిసరాల్లో స్థిరపడిపోయాడు. ముందు తెలిసిన వాళ్లెవరూ లేనందుకు బాధపడినా, తరువాత క్రమంగా ఈ చోట స్నేహితులు, బంధువులు ఏర్పడ్డారు. ఇప్పుడు తమ ముఖ్య స్నేహితుల్లో రాయుడొకడు. అతడు తన భార్యతో కూడా చాలా చనువుగా మాట్లాడుతాడు. తాను ఆఫీసు వ్యవహారాలు చూసుకుంటున్నప్పుడు, రాయుడే ఆమెను షికారు తీసుకెళ్తూ, తాను లేని కొరతను తీరుస్తున్నాడు. రాయుడే లేకుంటే ఆమెకు పొద్దుపోవడం కష్టమే ...

ఇద్దరూ చెరియొక దోవలో ఆలోచిస్తున్నారు. నలభై అయిదు నిమిషాలకు పైగా కాలం ఎవ్వరికీ తెలియకుండా ఎగిరిపోయింది. క్రమంగా బండి వేగం తగ్గుతూ, ఒక చోట ఆగిపోయింది. బండివాడు వచ్చి తలుపు తీసి, "ఇల్లు వచ్చేసిందండీ!" అన్న మాటలకు ఇద్దరూ ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చారు.

ముందు ఆ నూతన వ్యక్తి బండి దిగి - డాక్టర్ మెడిసిన్ చెస్ట్ తీసుకుని బయలుదేరాడు.

ఆ ఇల్లు, పరిసరాలు చూడంగానే అది ధనవంతుల ఇల్లని డాక్టరు అనుకున్నాడు. ఇంట్లో దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

ఇద్దరూ కింద హాల్లోకి వచ్చారు. అంతా నిశ్శబ్దంగా ఉంది. ఎక్కడా మనిషి అలికిడే లేదు. "డాక్టర్! మీరిక్కడే కూర్చోండి. ఇంతలో నేను నా భార్యకు ఎట్లా ఉందో కనుక్కుని వస్తాను!" అంటూ ఆ నూతన వ్యక్తి డాక్టరు జవాబు కోసం ఎదురు చూడకుండా తొందరగా మేడ మెట్లెక్కి పోయాడు.

ఆ హాలులోని పటాలు, అలంకరించబడిన పద్ధతి, అక్కడక్కడా చెక్కబడిన శిల్పాలు చూస్తూ డాక్టరు కూర్చున్నాడు. అతననుకున్నట్లు ఈ ఇల్లు ధనవంతులది గాదు, జమీందార్లది. ఆ హాలంతా చాలా ఖరీదైన సామానుతో అలంకరింపబడి ఉంది. జమీందార్ల దాబు, దర్పం ఆ హాల్లోనే కనిపిస్తున్నది. డాక్టరు మూగవానివలె వాటిని పరిశీలిస్తున్నాడు.

ఇరవై నిమిషాలు గడిచినా లోపలకెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఆమె చనిపోయిందేమోనని డాక్టరుకు అనుమానం కలిగింది. అతనిలో మరలా విసుగు, అస్థిమితం ప్రవేశించాయి. తన కుమారుని మరణం, భార్య ఒక్కతే ఇంట్లో ఉండటం జ్ఞాపకానికి వచ్చి, త్వరగా పని తెముల్చుకుని పోవాలనుకున్నాడు. రెండు నిమిషాలు ఆగాడు. అసలు మనుషులు ఆ ఇంట్లో నివసిస్తున్నారా, లేదా అని అతనికి అనుమానం కలిగింది. కలగంటున్నానేమోనని అనుమానపడి గిచ్చుకుని చూశాడు. అబ్బా, నొప్పి పుట్టున్నది.

ఇక నిరీక్షించలేక మేడమీదకెళ్లడానికి ఉద్యుక్తుడైనాడు. ఇంతలో ఆ వ్యక్తి మేడమెట్లపై కనపడ్డాడు. అతణ్ణి చూచి డాక్టరు ఆశ్చర్యపడ్డాడు. అతని ముఖ లక్షణాలను చూచి భయపడ్డాడు. ముఖం కంది ఎర్రగా ఉంది. కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఏదో కాఠిన్యం అతని ముఖంలో ప్రవేశించింది. పళ్లు

కొరుకుతున్నాడు. పూర్వపు వ్యక్తేనా అని డాక్టరుకు అనుమానం కలిగింది. నెమ్మదిగా అతను మెట్లు దిగుతున్నాడు. డాక్టరు మెట్లు ఎక్కడానికి వచ్చి మెట్లవద్దనే నిలిచిపోయాడు.

ఆ వ్యక్తి "డాక్టరుగారూ! క్షమించండి. ఈ ఇంట్లో రోగి ఎవ్వరూ లేరు. కావాలంటే నన్ను పరీక్షించండి."

డాక్టరుకు కోపం వచ్చింది. తాగి ఉన్నాడేమో ననుకున్నాడు. కానీ, అంతా నటనని "నా సంగతి తెలిసీ నాతో హాస్యమాడుతున్నారా? ఎటువంటి పరిస్థితిలో మీ ఇంటికి వచ్చానో తెలుసు కదూ? నన్ను ఎగతాళి పట్టించడానికి ఇక ఏ రాత్రీ దొరక్కపోయిందా? చూపించండి మీ రోగిని!"

మెట్లు దిగుతూ ఆ నూతన వ్యక్తి, "చెప్పలేదా, డాక్టర్ రోగి లేదని! ఆమె ఎగిరిపోయింది. చనిపోలేదు. రెక్కలు గట్టుకుని ఎగిరిపోయింది!" అన్నాడు.

"నన్ను తమాషా పట్టించడానికి పిలిపించారా? కుమారుడు చనిపోయి ఏడుస్తున్న నేనే దొరికేనా నీకు? ఛీ, నీచుడా! నీకు హృదయం లేదూ?" అన్నాడు డాక్టర్ ఉద్రేకంతో వణికిపోతూ.

"శాంతించండి, డాక్టర్‌గారూ! నా పరిస్థితులు అర్థం చేసుకోండి. నేను మీ దగ్గరకు వచ్చేముందు రోగి ఉండిన మాట వాస్తవమే. ఆమె ఇప్పుడు లేదు. నా భార్య నటించింది. డాక్టర్! ఆ వెధవ ... రాయుడు నా స్నేహితుడని భ్రమించాను. ఎన్నాళ్లనుంచీ వాళ్లు ప్రేమకలాపాలు జరుపుతున్నారో నాకు మాత్రం తెలియదు. ఆ సంగతి తెలిసిఉంటే, ఆ వెధవను ఇంట్లోకి రానిచ్చేవాణ్ణేనా? నేను అనుమానించలేదు ..."

డాక్టరు ఏమీ మాట్లాడక ఆ నూతన వ్యక్తివైపు గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు. ఆ వ్యక్తి చెప్పుకునిపోతున్నాడు "చేతులు కాలినతరువాత ఆకులు పట్టుకుంటే లాభం ఏముంటుంది? ఈ ఆడజాతిని ఎట్లా నమ్మడం డాక్టర్? నా భార్య ... నా హృదయరాణి .... అబ్బా, ఎంతగా ప్రేమించాను! అది బీద కుటుంబంలో జన్మించినా, నేను పెళ్లి చేసుకున్నాను. దానికోసం బంధువులకు దూరమయ్యాను. ఈ రాయుడు నా జీవితంలో యముడల్లే ప్రవేశించాడు. నా భార్య ఎంత అమాయకంగా మాట్లాడేది? తేనె పూసిన కత్తి .... ఒకనాడేమన్నదో తెలుసా, డాక్టర్? అసలు లోకంలో భర్తను తప్ప ఇతరులను ప్రేమించడం అంటూ జరుగుతుందా అని అమాయకంగా అడిగింది. అమాయకురాలనుకున్నాను. కడకు నా గొంతు కోస్తుందని ఎవరికి తెలుసు? ఆ రాయుడు నా భార్యను పూర్తిగా వశపరచుకున్నాడు. వాడితో నా భార్యను తిరగనివ్వడం నా బుద్ధితక్కువే. పోయేటప్పుడు నాకో జాబు కూడా రాసిపెట్టిపోయింది నన్ను ప్రేమించనే లేదని. ఆ రాయుడు దాని జీవితంలో స్వర్గం సృష్టించాడని, తనకోసం వెతకక్కర్లేదని. డబ్బేమీ తీసుకుపోలేదనీను. దొంగముండ ...! ఇంకా అర్థం కాలేదా? డాక్టర్! నా భార్య జబ్బుగా ఉందని నటించి, ఆ రాయుడితో లేచిపోయింది! పొద్దున్న మనుషులకు నా ముఖమెట్లా చూపేది?"

"నీ సొద వినడానికి రాలేదు. నన్ను పంపించివేయండి!" అన్నాడు డాక్టర్ విసుగుతో.

"డాక్టర్! నేనూ, మీరూ ఇద్దరం మనుషులమే. నా పరిస్థితులు అర్థం చేసుకుని అలా మాట్లాడటం ధర్మం కాదు. ఇదిగో, మీ ఫీజు రెండువందలు తీసుకెళ్లండి ... మిమ్మల్ని శ్రమపెట్టినందుకు క్షమించండి!" అని రెండు పచ్చనోట్లు డాక్టరు చేతిలో పెట్టాడు.

ఆ నోట్లను డాక్టరు నలిపి ఆ వ్యక్తి ముఖాన విసిరికొట్టి, "నేను డబ్బుకోసం రాలేదు. ఒక వ్యక్తి చావు బతుకుల్లో ఉందంటే బతికించగలనేమోనని వచ్చాను. నన్ను త్వరగా పంపండి!"

ఆ వ్యక్తి ఏమీ అనలేదు. "రహీమ్!" అంటూ గట్టిగా అరిచాడు. రహీమ్ లోపలికి వచ్చాడు. "డాక్టరుగారిని ఇంటి దగ్గర దిగబెట్టి రా!"

రెండు నిమిషాల్లో డాక్టరు బండి ఎక్కాడు. ఏది మరచిపోయినా డాక్టర్ ఈ సంఘటనను తన జీవితంలో మరచిపోలేదు.

## సాహిత్య కబుర్లు

## ఓటు కవిత్వం

ఎలక్షన్లు వచ్చేస్తున్నాయ్. రాజకీయనాయకులకి ఓట్ల పండగ. ఓటర్లకి శుద్ధ దండగ. 'ఎవడొస్తే ఏమిటి?' అనే నిర్లిప్తత అందరిలోనూ వుంది. కవులు ఈ ఎన్నికలపై నానా రుచికరంగా కవితలు రాశారు. అందరి బండారాలను బయటపెట్టే ధైర్యం కవికే వుంది మరి! వాళ్ల కలం నుంచి తప్పించుకోవడం రొంబ కష్టమే మరి!

1937లో చల్లపల్లి రాజా ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు కాటూరి వేంకటేశ్వరరావు గారు ఎంత ధైర్యంగా ఓటుపాట రాశారో చూడండి.

**"ఇల్లు వాకిళ్లమ్మి పెళ్లాము నగలమ్మి**
**కళ్ల ప్రాణాలతో పళ్ల బింకాలతో**
**చెల్లించితివిమి నీకు శిస్తులూ కిస్తీలు**
**ఓటు ఓటనియేవు వోటు నిమ్మనియేవు**
**ఓటు నీకెటులిత్తుమో రాజా**
**ఎండకన్నెరుగవూ, ఏడు మేడల మీద**
**పండుకొని కారులో పరవళ్లు పోతావు**
**రాచబిడ్డవు నీవు నీకు రైతు కష్టేమెరుక**
**ఓటు నీకెటు లిత్తుమో రాజా!"**

కొన్ని కవితలు వ్యంగ్యంగా రాజకీయనాయకులకు చురకలు వేస్తూ వుంటాయి. ఇవి ఆ నాయకులకు చురకలు వేస్తూ వుంటాయి. ఇవి ఆ నాయకులకు, ఆ అభ్యర్థులకు చదివి వినిపించి, అర్థం విడమరచి చెప్పినా ప్రయోజనం వుండదేమో! ముద్దులపల్లి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఎన్నికల హడావిడిని గ్రామ్యభాషలో ఎలా చూపించారో చదవండి.

"ఇడవరు, యింటిసుట్టు వలవేత్తరు, సూత్తరు, వంక దణ్ణముల్
పెడతరు, మేలు సేస్తమని పెగ్గెలు
బల్కుత రాపనైన వెం
బడి తిరిగ్గైన సూడరిసుమంటి
పెబుద్దులు రాజ్జెమేలితే
కుడిసి కుకండనిస్తర! మొగుండ్లయి
సూస్తనే గొంతుకూయరా" శ్రీశ్రీ 'బొమ్మలాంతరు' కవితలో అభ్యర్థుల్ని ఇలా ఎద్దేవా చేస్తాడు.

"నిన్నటి వాగ్దానాన్ని నేటి ఉపన్యాసంతో కాల్చేసి
నేటి ఫోర్డరీని రేపటి సంతకంగా మార్చేసి
ఇక్కడే వుండొస్తానని
ఇక్కడకో పోయాడు వినాయకుడు.

ఆరుద్ర "బ్రూటుకు వేసిన ఓటు బురదలో గిరవాటు' అన్నాడు. కాళోజీ ఓటు విలువ గురించి మంచి కవిత్వం రాశాడు. మనం కుండ కొనాలంటే పది కొట్లు తిరిగి పరీక్షించి కొంటాం. మరి అంత శ్రద్ధ ఓటు వేసేటప్పుడు ఏమయింది? అంటూ ఈ విధంగా సలహాలిస్తాడు.

"అభ్యర్థి ఏ పార్టీవాడని కాదు ఏపాటి వాడని చూడు
ఎన్నుకుంటే వెలగబెట్టడం చూడు
ఇందాకా ఏం చేశాడో చూడు.
నుడువులు కాదు- నడవడి చూడు.'

రాజకీయనాయకులు పగటివేషధారణలో ఫస్ట్‌ప్రయిజ్ కొట్టగలరనీ, అడ్డం బటి కాళ్లకు దండాలు పెడతారనీ, ఆ పైన ఖయ్యూముకు వారసులై హైదరాబాదును అత్తవారిల్లులా చేసుకుంటారనీ, గజ్జెల మల్లారెడ్డి చెప్పనే చెప్పారు. కాబట్టి ఓటర్లూ తస్మాత్ జాగ్రత్త!

ద్వానా శాస్త్రి